సాక్షి
నారాయణపేట
శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



..ఆరోగ్య ప్రదాయిని

ఎన్నో ఔషధ గుణాలు కలిగిన బొప్పాయి ఆరోగ్య ప్రదాయినిగా నిలుస్తోంది.

వివరాలు 8లో ▸



వైద్య విజ్ఞాన సదస్సు

ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సు ఆకట్టుకుంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.5 /21.5

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రెండు రోజులు 'భగీరథ' నీటి సరఫరా నిలిపివేత

నారాయణపేట: ఈ నెల 21 నుంచి 23 వరకు నీటి సరఫరాను **నిలిపి వేయడం జరుగుతుం** దని మిషన్ **భగీరథ గ్రిడ్ డివిజన్ అధికారి పుట్ట** వెంకట్ రెడ్డి **శుక్రవారం ఒక ప్రకటనలో** తెలిపారు. మరికల్ నుంచి నారాయణపేట వెళ్లే దారిలో మిషన్ భగీరథ పైపులైన్ నాలుగు ప్రదేశాలలో లీకేజీలు ఉండడంతో వాటిని మరమ్మతు చేసేందుకు 48గంటలు సమయం పడుతుందని తెలిపారు. మన్యంకొండ నీటి శుద్ధి కేంద్రం నుంచి నీటి సరఫరా అయ్యే దేవ రకద్ర, నారాయణపేట, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని నర్వ, మరికల్, ఊట్కూర్, నారాయణపేట, దామరగిద్ద మండలాలు పూర్తిగా, కొకుంట్ల, చిన్నచింతకుంట, మక్తల్, ధన్వాడ మండలాలు పాక్షికంగా, మక్తల్, నారాయణపేట మున్సిపాలిటీలు పూర్తిగా 245 గ్రామాలు, 2 మున్సిపాలిటీలు నీటి సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ లక్ష్యం



కోస్గి: ఉపాధ్యాయ వర్గాల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ నిరంతరం శ్రమిస్తుందని, ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం గుండుమాల్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గ ఎన్నికకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రకాష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా అనంతయ్య, గౌరవ అధ్యక్షుడిగా నర్సిములు, కార్యదర్శిగా వెంకట్రామ్‌రెడ్డి, బిచ్చయ్య గౌడ్, బాల కిష్టయ్య, మహిళ కార్యదర్శులుగా గీత, భాను కుమారి, శ్వేతతోపాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

మార్కెట్ యార్డు దుకాణ సముదాయానికి టెండర్

కోస్గి: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నూతనంగా నిర్మించిన దుకాణాలకు సంబంధించి నెలవారి అద్దెకు ఇచ్చేందుకు ఈ నెల 18న నిర్వహించాల్సిన టెండర్ ప్రక్రియను అనివార్య కారణాల వల్ల వచ్చే నెల 1వ తేదీకి పొడిగించినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి శివశంకర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కెట్ కమిటీ నిధులతో తాండూర్ రోడ్డులో నిర్మించిన 9 దుకాణాలను టెండర్ ద్వారా కేటాయిస్తామని, వచ్చే నెల 1న నిర్వహించే ఈ టెండర్లకు డీడీలు తీసి దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు మార్కెట్ కమిటీ కార్యదర్శి సెల్ 7330733298, పర్సన్ ఇన్‌చార్జ్ సెల్ 7330733146లలో సంప్రదించాలని తెలిపారు.

జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేయాలి



నారాయణపేట: రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలని పిడమర్తి రవి కోరారు. ఆయన ఆధ్వర్యంలో కొనసాగుతున్న మాదిగల మేలుకొలుపు యాత్ర శుక్రవారం జిల్లాకు చేరుకుంది. అంబేద్కర్ జాతర జిల్లా కమిటీ అధ్యక్షుడు, కౌన్సిలర్ మహేష్ అధ్యక్షతన కార్యక్రమం కొనసాగగా.. యాత్రను ఉద్దేశించి పిడమర్తి రవి మాట్లాడారు. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో మాదిగలకు జనాభా ప్రతిపాదికన ప్రాంతాలవారీగా రిజర్వేషన్లు అమలు చేస్తుందని, మన రాష్ట్రంలో సైతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లను, జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేస్తుందని నమ్మకం ఉందన్నారు. ఎస్సీలకు ఏబీసీడీ వర్గీకరణ ద్వారా సమ న్యాయం జరగదని, జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ ద్వారానే సమ న్యాయం జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ పిడమర్తి రవి మాదిగల అభ్యున్నతి కోసం ఎంతో కృషిచేస్తున్నారని, ఆయనకు మన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈనెల 30న జరిగే ముగింపు సభకు భారీ ఎత్తున మాదిగలు పాల్గొని విజయవంతం చేయాలని యాత్ర నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు టీ మాధవ్, కృష్ణ, చంటి, రమేష్, బాబు, విష్ణు, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లపై కొరడా

పౌరసరఫరాలశాఖ కమిషనర్ ఆదేశాలతో రంగంలోకి స్పెషల్ టీం



నాచహళ్ల వద్ద ఉన్న బాయిల్డ్ మిల్లులో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తనిఖీలు

- ధాన్యం లేని రెండు మిల్లులపై కేసులు నమోదు
- శుక్రవారం రాత్రి వరకు కొనసాగిన ఆకస్మిక తనిఖీలు
- 15రోజుల్లో రెండుసార్లు దాడులతో మిల్లర్లలో గుబులు
- వనపర్తి జిల్లాలో 90 శాతం దాక డిఫాల్టర్లుగానే నివేదిక



గోవర్ధనగిరిలోని ఓ రైస్‌మిల్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

వనపర్తి: సీఎంఆర్ ధాన్యం మాయం చేసిన మిల్లర్లపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. మొదట సీఎంఆర్ కోసమే ధాన్యం కేటాయించినా.. పెరిగినపోయిన మునుపటి బియ్యం నిల్వల దృష్ట్యా 2022– 23 రబీ సీజన్‌కు సంబంధించి బియ్యం కోసం కాదని, యాక్షన్‌లో పెట్టేందుకు ఆ ధాన్యం ఉపయోగించాలని నిర్ణయించిన సివిల్ సప్లయ్ శాఖకు ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పుడు యాక్షన్‌లో పెట్టేందుకు సిద్ధమైతే.. ధాన్యం లేకపోవడంతో మిల్లర్లపై అధికారులు దాడులు చేస్తున్నారు. జిల్లాలో గత 15 రోజుల క్రితం ఐదు మిల్లర్లపై కేసులు నమోదు చేయగా.. తాజాగా శుక్రవారం పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎండీ చౌహాన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం జిల్లాలో పర్యటించి రెండు మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం మిల్లర్లలో గుబులు పుట్టిస్తోంది. గతంలో జిల్లాలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి బంధువులకు సంబంధించిన వనపర్తి మండలంలోని నాచహళ్లి గ్రామ శివారులోని ఓ బాయిల్డ్ మిల్లులో రూ.33.83 కోట్లు, పీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామంలోని ఓ రా మిల్లులో రూ.7.86 కోట్ల విలువ చేసే ధాన్యం నిల్వలు లేకపోవడంతో ప్రస్తుతం కేసులు నమోదు చేసినట్లు పౌరసరఫరాల శాఖ డీఎం ఇర్ఫాన్ వెల్లడించారు. 2022– 23 రబీ సీజన్‌లో ధాన్యం దించుకున్న మిల్లర్లలో 90 శాతం మిల్లర్లు డిఫాల్టర్లుగానే ఉన్నట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు.

చర్యలు తప్పవు..

పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 2022– 23 రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం ఎవరి వద్ద లేకున్నా చర్యలు తప్పవు. గతంలో ఐదు మిల్లులపై కేసులు నమోదు చేశాం. తాజాగా మరో రెండు మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాం. జిల్లావ్యాప్తంగా 2.20 లక్షల మె.ట., ధాన్యం మిల్లర్ల నుంచి మాకు రావాల్సి ఉంది. ఈ ధాన్యం యాక్షన్ చేసేందుకు ఉంచాం. సీఎంఆర్ కోసం ఉపయోగించొద్దని ఆదేశాలున్నాయి. అయినా ధాన్యం నిల్వలు లేక పోవడంతో చర్యలు తీసుకుంటున్నాం.

– ఇర్ఫాన్, డీఎం సివిల్ సప్లయ్ శాఖ, వనపర్తి

ఆ ప్రశ్నకు సమాధానమేది?

2022– 23 రబీ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా సుమారు 78 నుంచి 80 మిల్లర్లకు 2.20 లక్షల **మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయిం**చారు. **బియ్యం అక్కరలేదు కేవలం ఈ** ధాన్యం **యాక్షన్‌లో పెట్టేందుకేనని కేటాయిం**పులు **చేసిన కొన్నాళ్లకే చెప్పినా.. మిల్లర్లు పెడ**చెవిన **పెట్టి ఎక్కడికక్కడ నిల్వలను ఖాళీ చే**సినట్లు తెలుస్తోంది. ఇటీవల అప్పటి ధాన్యం వేలం వేసేందుకు పౌరసరఫరాల శాఖ ప్రక్రియ ప్రారంభించే క్రమంలో పరిశీలన చేయగా.. సదరు ధాన్యం నిల్వలు ఎక్కడా కనిపించకపోవడం, దీనికి సంబంధించి మిల్లర్ల నుంచి సరైన సమాధానం లేకపోవడంతో పౌరసరఫరాల శాఖ సీరియస్‌గా తీసుకుంది. ఈ మేరకు క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం రంగంలోకి దిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేస్తూ.. కేసులు నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అటు మిల్లర్లు, ఇటు పౌరసరఫరాల శాఖ అధికారుల్లో చర్చ జోరుగా సాగుతోంది.

■ సీఎంఆర్ పెండింగ్ ఉన్న కొందరు రైస్ మిల్లర్ల ఇళ్లపై దాడులు చేసి ఆర్ఆర్ యాక్ట్ అమలు చేసి ఆస్తులను జప్తు చేసిన విషయంలో మిల్లర్లు సైతం ఆందోళన బాటపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరోసారి జిల్లాలో మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొనేలా చేస్తోంది. కాగా.. కొందరు మిల్లర్లు మాత్రం బలవంతంగా ధాన్యం అంటగట్టి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



కొల్లంపల్లి జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట రూరల్: విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని.. క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం నారాయణపేట మండలంలోని కొల్లంపల్లి ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను ఆమె సందర్శించారు. విద్యార్థుల లెసన్ ప్లాన్, స్టాఫ్ రిజిస్టర్, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అక్కడే కొనసాగుతున్న అంగన్‌వాడీ 1 కేంద్రానికి వెళ్లి శ్యామ్ మ్యామ్ పిల్లల వివరాలు ఆరా తీశారు. అలాగే, జెడ్పీ పాఠశాలకు చేరుకొని శనివారం జరిగే పేరెంట్స్ మీటింగ్‌కు తల్లిదండ్రులను తప్పకుండా తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్‌లో ఏం మాట్లాడుకున్నారనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ప్రతి రోజు పాఠశాలకు వస్తేనే హాజరు శాతం పెరుగుతుందని, తద్వారా ఫలితాలు కూడా మెరుగుపడతాయని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన

కొల్లంపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో కలెక్టర్ వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. నెల రోజులుగా నీటి ఎద్దడి నెలకొందని, గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని, తమ సమస్యకు పరిష్కారం చూపించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

చిన్నపిల్లల ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నారాయణపేట: సీజనల్ జ్వరాలు, వ్యాధులతో చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, ప్రభుత్వ చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకువస్తే వైద్యులు లేక మెరుగైన వైద్యం అందడంలేదని, వసతులు సైతం అంతంతమాత్రంగా ఉండడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయు జిల్లా కార్యదర్శి బలరాం, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మమ్మద్ అలీ, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు ఆస్పత్రిని సందర్శించి రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్పత్రికి రోజూ 250 నుంచి 300 మంది ఔట్ పేషెంట్స్ వస్తున్నారని, కేవలం ముగ్గురు డాక్టర్లు ఉండడంతో సత్వర వైద్యం అందడంలేదని, గదుల్లో ఏ ఒక్క ఫ్యాన్ పనిచేయకపోవడం, సరిపడా బెడ్లు లేక ఒకే బెడ్‌పై ఇద్దరు ముగ్గురు రోగులను ఉంచి వైద్యం అందిస్తున్నారని,మరుగుదొడ్ల సమస్య తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని వారితోపాటు వికలాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కే.కాశప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలకృష్ణ, పవన్ ,భాను తదితరులు కోరారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడండి



రికార్డులు పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రభాకర్

మాగనూర్: రాత్రి సమయాల్లో వినియోగదారులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రభాకర్ ఆదేశించారు. శుక్రవారం మాగనూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. మండలంలోని విద్యుత్ సరఫరాపై ఏమైన ఇబ్బందులు ఉన్నాయా సిబ్బందితో ఆరా తీశారు. అర్హులైన గృహ వినియోగదారులకు జీరో బిల్లు వర్తింపజేయాలని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ దేవేంద్రనాయుడు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

- అధికారులు ప్రతి గ్రామాన్ని విధిగా సందర్శించాలి : ఎమ్మెల్యే

నారాయణపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, వీలైనంత వరకు గ్రామాల్లో ఏ సమస్యలు రాకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో నారాయణపేట, దామరగిద్ద మండలాలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో పంచాయతీరాజ్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, మిషన్ భగీరథ, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పర్యటించాలన్నారు. ముఖ్యంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లో రోడ్లు పాడైపోయాయని పునరుద్ధరించుటకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టం వివరాలను సేకరించాలని, మంచినీటి పైప్‌లైన్లు లీకేజీ లేకుండా చూడాలన్నారు. తాను త్వరలో గ్రామాల్లో పర్యటించి అధికారుల ద్వారా సమస్యలు పరిష్కారం అవుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకుంటానన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ శివారెడ్డి, డీఆర్‌డీఓ మొగులప్ప, డీపీఓ కృష్ణ, ఎంపీడీవోలు సుదర్శన్ సాయి లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

అనుచిత పోస్టులు పెడితే చర్యలు : ఎస్పీ

నారాయణపేట: ఒక వర్గాన్ని, ఒక మతాన్ని కించపరుస్తూ లేదా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు, దుష్ప్రచారం చేయరాదని, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేష్ గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయంగాను, కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని షేర్ చేసినా చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. సామాజిక మద్యమాలను మంచి పనులకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు.

ఆర్‌ఎన్ఆర్ @ 2,300

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన ఈనామ్ టెండర్లలో ఆర్ఎన్ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,300 ఒకే ధర పలికింది. మార్కెట్‌కు కేవలం ధాన్యం మాత్రమే అమ్మకానికి వచ్చింది. సీజన్ లేకపోవడం వల్ల మార్కెట్‌లో లావాదేవీలు చాతా తక్కువ మొత్తంలో సాగాయి.

చెరకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

నర్వ: చెరకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని చెరకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కె.రాజన్న డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్ద కడ్మూర్ రైతువేదికలో నర్వ మండల చెరకు రైతుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చెరకు ట్రాన్స్‌పోర్టు, కటింగ్ పోను టన్నుకు రూ.3500 రైతులకు అందించాలని, రైతులని గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి యాజమాన్యం సంఘంతో చర్చించి నిర్ణయించిన ధరకే కోతలు చేపట్టాలని అన్నారు. అదేవిధంగా అధిక టన్నులు దిగుబడి వచ్చిన విత్తనాన్ని రైతులకు ఇచ్చి దిగుబడి పెంచే విధంగా చూడాలని కోరారు. అనంతరం ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నర్వ మండల చెరకు రైతుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వెంకటేష్‌చారి, ఉపాధ్యక్షులుగా గోవిందు, ఆనంద్‌రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

ఎస్ఎల్‌బీసీకి అధిక ప్రాధాన్యత

- మూడేళ్లలో ప్రాజెక్టులు పూర్తి
- రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలించిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తామని, ఎస్ఎల్‌బీసీని నెలవారీగా క్రమం తప్పకుండా నిధులు విడుదల చేసి ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి శివారులోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్రస్థాయి ఇరిగేషన్, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రత్యేక హెలీకాప్టర్‌లో హైదరాబాద్ నుంచి వచ్చిన వారు టన్నెల్‌ను పరిశీలించారు. అనంతరం టన్నెల్ సమీపంలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో పాల్గొన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రపంచంలోనే అతిపెద్ద గ్రావిటీ కెనాల్ అని, 4 లక్షల ఎకరాలకు నీరందించే ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆలస్యమై.. వ్యయం రూ.4 వేల కోట్లకు పెరిగిందన్నారు. తాము చేపట్టిన జలయజ్ఞంలో మిగిలిన 30, 40 శాతం ప్రాజెక్టులన్నింటితో పాటు గత ప్రభుత్వం చేపట్టిన వాటిని సైతం పూర్తి చేస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రతినెల రూ.14 కోట్లు అవుతాయని ఇరిగేషన్ శాఖ అధికారుల అంచనాల మేరకు క్రమం తప్పకుండా నిధులు ఆర్థికశాఖ ద్వారా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఒక క్యాలెండర్‌ను ఏర్పాటు చేసుకుని టన్నెల్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. టన్నెల్ రెండువైపులా ప్రతి నెల 400 మీటర్ల వరకు వెళ్లేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తూనే.. డిండి లిఫ్ట్ ఇరిగేషన్‌ను సైతం పూర్తి చేయాలని, భువనగిరి, నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, అచ్చంపేట నియోజకవర్గంలోని అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని చేపడుతామన్నారు. నల్లగొండ జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు పూర్తిచేసి సస్యశ్యామలం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే ఇతర బ్రాహ్మణ వెల్లేముల, ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి కాల్వ, బునియాదిగాని కాల్వలను పూర్తి చేస్తామన్నారు. అలాగే ఆయా ప్రాజెక్టుల కింద పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్ఆర్ ప్యాకేజీలకు సైతం ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తామన్నారు. నక్కలగండి, ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వంటి వాటికి ఒకే ఫైల్‌లో ప్రతిపాదనలు పంపిస్తే తక్షణమే మంజూరు చేస్తామన్నారు.

రూ.4,400 కోట్లు మంజూరు చేస్తాం..

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు సవరించిన అంచనాల ప్రకారం రూ.4,400 కోట్లు పెంచి మంజూరు చేస్తామని ప్రకటించారు. సొరంగం పనుల కోసం అయ్యే ఖర్చును ఏజెన్సీకి సాధ్యమైనంత త్వరగా చెల్లిస్తామని, ఎట్టి పరిస్థితుల్లో ఎస్ఎల్‌బీసీ ద్వారా 2027 సెప్టెంబర్ 20 నాటికి సాగునీటిని అందిస్తామన్నారు. అలాగే డిండి ప్రాజెక్టుపై ప్రతివారం సమీక్షించాలని ఇరిగేషన్ సెక్రటరీని ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీతో పాటు డిండి ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేస్తామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులకు ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్, బాలునాయక్, జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, నర్సిరెడ్డి, చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, నాగర్‌కర్నూల్, నల్లగొండ కలెక్టర్లు బదావత్ సంతోష్, నారాయణరెడ్డి, ఎస్పీలు గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, చంద్రపవార్, ఆర్డీఓలు మాధవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెరవేరనున్న చిరకాల స్వప్నం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే చిరకాల స్వప్నం నెరవేరనుందన్నారు. ఏఎంఆర్పీ శాశ్వత పరిష్కారం కాదని గతంలోనే తాను గుర్తించానని అందుకే ఎస్ఎల్‌బీసీ మాత్రమే శాశ్వత పరిష్కారంగా భావించి 2004 మేనిఫెస్టోలో చేర్పించడం జరిగిందన్నారు. శ్రీశైలం నీరు డెడ్ స్టోరేజీకి వెళ్లినప్పటికీ ఎస్ఎల్‌బీసీ ద్వారా 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు.

■ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సాగునీరు ఓవర్ ఫ్లో అవుతున్నందున గొట్టిముక్కల, సింగరాజుపల్లి రిజర్వాయర్లను నింపుకోవచ్చన్నారు.

■ అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఇదివరకే మంజూరై పరిపాలన అనుమతి వచ్చిందని, త్వరలోనే శంకుస్థాపన చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో అవసరం ఉన్న చోట హై లెవెల్ బ్రిడ్జిలు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పరిష్కరించాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని, కేఎల్ఐ కాలువల మరమ్మతు చేపట్టాలని కోరారు.

క్లుప్తంగా

తండ్రిని నరికి చంపిన కుమారుడు


నారాయణ (ఫైల్)

రాజాపూర్: మతిస్థిమితం కోల్పోయిన ఆ కొడుకు కన్నతండ్రి పాలిట కాలయముడు అయ్యాడు. అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న తండ్రిని గొడ్డలితో అతి కిరాతకంగా నరికి చంపాడు. ఈ విషాదకర సంఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని రాయపల్లి గ్రామానికి చెందిన కావలి నారాయణ(52), చంద్రకళ దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు. కుమారుడు నందేష్ మానసిక పరిస్థితి బాగోలేకపోతే ఆస్పత్రులకు చూపించినా నయం కాలేదు. ఈ క్రమంలో గురువారం రాత్రి తండ్రి నారాయణ ఓ పరిశ్రమలో పనిచేసి వచ్చి రాత్రి ఇంట్లో పడుకున్నాడు. అయితే రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో ఓ మూలకు ఉన్న గొడ్డలి తీసుకుని నిద్రిస్తున్న తండ్రి గొంతుపై మూడు వేట్లు వేశాడు. పక్కనే ఉన్న తల్లి అలికిడి నిద్ర లేచి చుట్టుపక్కల వారిని నిద్ర లేపింది. దీంతో పక్కింట్లో ఉన్న నారాయణ తమ్ముడు రవి వచ్చి అడ్డుకోగా.. అతనిపై దాడికి ప్రయత్నించడంతో త్రుటిలో తప్పించుకున్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అదేరాత్రి నందేష్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. శుక్రవారం ఉదయం జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, క్లూస్‌టీం సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై నారాయణ భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

అడ్డాకుల: మూసాపేట మండలం తుంకినీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్య(60) బావిలో పడి మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. లక్ష్మయ్యకు కొన్నాళ్ల నుంచి మతిస్థిమితం సరిగా లేదు. దీంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడెక్కడికో వెళ్లేవాడు. ఈక్రమంలో వేములకు వెళ్లే దారిలో ఉన్న గుండ్రాయి బావిలో పడి చనిపోయాడు. శుక్రవారం బావిలో మృతదేహం కనిపించడంతో క్రేన్ సాయంతో బయటికి తీయగా లక్ష్మయ్యగా గుర్తించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. లక్ష్మయ్య భార్య పదేళ్ల కిందట మృతి చెందగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనతో తుంకినీపూర్‌లో విషాదం అలుముకుంది. కాగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పి.శ్రీనివాసులు తెలిపారు.

భార్య వేధింపులతో భర్త అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాల నేపథ్యంలో తన భార్య వేధింపులు తీవ్రమయ్యాయని, భరించలేక ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని, తనని ఎవరూ వెతకవద్దంటూ ఓ వ్యక్తి లెటర్ రాసి వెళ్లిపోయిన ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా.. జిల్లా కేంద్రానికి చెందిన వెంకటాచారి ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తరచూ భార్యతో కలహాలు చోటుచేసుకునేవి. ఈక్రమంలో శుక్రవారం తన భార్య వేధింపులు తాళలేకపోతున్నానని, ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని లెటర్ రాసి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు లెటర్ గమనించి తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో అతని తల్లి అలివేలమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పురుగు మందు తాగిన తల్లీకొడుకు..

గోపాల్‌పేట: తల్లీకొడుకులు పురుగు మందు తాగిన ఘటన మండలంలోని ఏదుట్లలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాజు, తన భార్య కళమ్మ, తల్లి సాయమ్మ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే కొంతకాలంగా రాజు భార్య అనారోగ్యానికి గురై కదలలేని స్థితిలో మంచానికే పరిమితమైంది. శుక్రవారం ఇంట్లో ఏం జరిగిందో తెలియదు కానీ క్షణికావేశంలో వ్యవసాయ పొలాలకు కొట్టే పురుగు మందును తన తల్లి సాయమ్మకు తాగించి రాజు సైతం తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి ఇద్దరినీ వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాజు తల్లి సాయమ్మ పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. అయితే ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ హరిప్రసాద్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

కేటీదొడ్డి: పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన బాలిక ఇందిర(17) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. మండలంలోని ఉమ్మిత్యాల గ్రామానికి చెందిన ఇందిర ఈ నెల 12న ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులు గద్వాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించగా.. పరిస్థితి విషమించి శుక్రవాకం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొప్పాయి.. 'ఆరోగ్య ప్రదాయిని'



ఆరోగ్యపరంగా..

బొప్పాయిలో ఏ,బి,సి,డి, కాల్షియం పుష్కలంగా లభిస్తాయి. గర్భాశయ, ప్రొస్టేట్, కాలెయం, ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను నివారించడంలో అద్భుతంగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. మూత్రపిండాల్లోని రాళ్లను కరిగించడంతో పాటు కళ్లకు కూడా చాలా మంచిది. చెడు కొవ్వును కరిగించి ఎర్ర రక్త కణాలను పెంచి గుండెకు రక్తం సరఫరా చేయడంతో పాటు ఆక్సిజన్ సరఫరాకు, చర్మ, కేశ సంరక్షణకు ఎంతగానో దోహదం చేస్తుంది. బొప్పాయి పాలను తేలు కుట్టిన చోట రాస్తే విషం తొలగిస్తుంది.


జిన్నారంలో సాగవుతున్న బొప్పాయి తోట


విరగకాసిన బొప్పాయి

- పాలమూరు జిల్లాలో విస్తరిస్తున్న సాగు
- రెడ్‌లేడీ తైవాన్ రకానికి డిమాండ్
- ప్లేట్‌లెట్లు పెంచడంలో కీలకం
- సస్యరక్షణతో అధిక దిగుబడులు.. లాభాల బాటలో రైతులు

గండేడ్: బొప్పాయి పండుతో పాటు ఆకుల్లోనూ ఔషధ గుణాలు ఉండటం.. రోజురోజుకు వీటి వినియోగం పెరగడంతో సాగు విస్తరించడంతో రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 141 ఎకరాల్లో బత్తాయి సాగవుతుండగా.. జడ్చర్ల, దేవరకద్ర, మహబూబ్‌నగర్, చిన్నచింతకుంట, గండేడ్ తదితర మండలాల్లో అధికంగా ఉంది. ఒక ఎకరా సాగుకు రూ.70 వేల పెట్టుబడి అవుతుండగా.. సుమారు 70 టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. అంటే దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వస్తుండటంతో జిల్లాలో ఎకరాల్లో సాగుచేసి రూ.లక్షల్లో లాభాలు అర్జిస్తున్నారు.

అనంతపూర్, ముంబై నుంచి మొక్కలు..

కొందరు బొప్పాయి విత్తనాలు తెచ్చి నారు పోసుకుంటుండగా.. ఎక్కువ మంది అనంతపూర్, ముంబై నుంచి నారు తీసుకొచ్చి నాటుతున్నారు. నారు పెంచడం కొంత కష్టంగా ఉండటంతో రూ.15కు ఒక మొక్క చొప్పున ఎకరాకు 1,200 మొక్కల వరకు నాటుతారు. డ్రిప్ విధానంలో సకాలంలో నీటిని అందించడంతో 8 నుంచి 9 నెలల్లో దిగుబడి ప్రారంభమై సుమారు ఏడాదిన్నర పాటు వస్తుంది. వారంలో రెండు, మూడుసార్లు పండ్లను తెంపవచ్చు. ఒక్కో మొక్క తన జీవితకాలం పూర్తయ్యే వరకు క్వింటాపైనే దిగుబడినిస్తుంది.

తెగుళ్ల బెడద ఎక్కువే..

బొప్పాయి సాగులో తెగుళ్ల సమస్య కూడా ఎక్కువే. నారు పోసినప్పటి నుంచి రకరకాల తెగుళ్లు సోకుతాయి. కాండం మొదలు కుళ్లు, బూడిద, ఆకుమచ్చ తెగులు, మొజాయిక్, రింగ్ వైరస్, ఆకుముడత, పండు ఈగ ఇలా రకరకాల తెగుళ్లు ఉంటాయి. వీటితో వేరు, కాండం కుళ్లిపోవడంతో అధిక నష్టాలు జరుగుతాయి. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితేనే ఆశించిన మేర దిగుబడి పొందవచ్చు. పశువుల ఎరువును వినియోగించడంతో పాటు డ్రిప్ ద్వారా క్రమం తప్పకుండా మందులు అందిస్తే మొక్కల ఎదుగుదల ఉంటుంది. చెట్ల కింద పడ్డ పండ్లను ఏరి దూరంగా పారేయాలి. తోట చుట్టూ ఫెన్సింగ్ ఉండటంతో పశువులు లోనికి రావు. తోటలు చిన్నగా ఉన్నపుడు ఈదురు గాలులకు మొక్కలు నేలవాలే అవకాశం ఉంది. దీనిని అధిగమించేందుకు ఎత్తయిన బోదేలు ఏర్పాటు చేసి మల్చింగ్ చేసుకుంటే ఇబ్బందులు ఉండవు.

'రెడ్‌లేడి'కి డిమాండ్..

బొప్పాయిలో డైషియస్, గైనోడైయూషియస్ అనే రెండు రకాలున్నాయి. గైనోడైయూషియస్ రకానికి చెందిన రెడ్‌లేడికి మార్కెట్లో భలే డిమాండ్ ఉంది. తైవాన్‌కు చెందిన ఈ రకం తెగుళ్లను తట్టుకొని ఆశించిన మేర దిగుబడి వస్తుంది. పండ్లు పెద్దవిగా నారింజరంగు గుజ్జు కలిగి తియ్యగా ఉండటమేగాక ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. దూర ప్రాంతాలకు తరలించేందుకు అనువైనది కావడంతో ఎక్కువ మంది రైతులు దీనినే ఎంపిక చేసుకుంటున్నారు. సన్‌రైజ్ సోలో రకం కూడా నారింజ రంగు గుజ్జు కలిగి రుచిగా ఉంటుంది. సూర్య రకం బొప్పాయి రుచితో పాటు ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. అర్క ప్రభాత్ గైనోడైయుషియస్ రకం ఇది 1.3 కిలోలు ఉండటంతో పాటు 10 నుంచి 12 రోజుల వరకు నిల్వ ఉంటుంది. ఇలా బొప్పాయిలో పలు రకాలు ఉన్నాయి. కాని ఈ ప్రాంతంలో మాత్రం రైతులు రెడ్‌లేడీ సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఇటీవల కొన్నిచోట్ల కో–15 రకం సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు.


ఎగుమతికి సిద్ధంగా ఉన్న బొప్పాయి

ఆరేళ్లుగా సాగు చేస్తున్నా..



ఆరేళ్లుగా దానిమ్మ, బొప్పాయి సాగు చేస్తున్నా. బొప్పాయిలో రెడ్‌లేడీ 786 రకం సాగుతో మంచి లాభాలు వచ్చాయి. అయితే ఈ రకానికి తెగుళ్లు ఎక్కువగా సోకడంతో ఎక్కువ మొత్తంలో మందులు వాడాల్సి వచ్చేది. శ్రమ కూడా ఎక్కువే కావడంతో దానికి బదులు కో–15 రకం సాగు చేస్తున్నా. జూన్, జూలైలో నాటితే తెగుళ్ల బెడద తక్కువగా ఉండటంతో పాటు మొక్కలు ఏపుగా పెరిగి సకాలంలో దిగుబడి వస్తుంది. ఇప్పటి వరకు నష్టం మాత్రం రాలేదు.

– కరుణాకర్, చిన్నచింతకుంట

ఖతార్‌కు ఎగుమతి చేశా..



20 ఏళ్లుగా బొప్పాయి సాగు చేస్తున్నా. మొదట్లో హైదరాబాద్ ఫ్రూట్ మార్కెట్‌లో అమ్మేవాడిని. తర్వాత ఏడాది పాటు దుబాయ్‌లోని ఖతార్‌కు ఎగుమతి చేశా. మంచి సైజ్ ఉన్న బొప్పాయి రోజుకు 500 బాక్సుల్లో పంపేవాడిని. ప్రస్తుతం బొప్పాయిని ఎర్రగడ్డ రైతుబజార్‌లోని సొంత దుకాణంలో విక్రయిస్తా. ప్రస్తుతం నాలుగు ఎకరాలు ఉండగా.. మరో ఆరు ఎకరాలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నా. రోజు తప్పించి రోజు లోడు తీసుకెళ్లి అమ్ముకుంటా.

– లక్ష్మయ్య, జిన్నారం (గండేడ్)

డెంగీని ఎదుర్కొనే శక్తి ఉంది..



డెంగీ సోకితే ప్లేట్‌లెట్లు తగ్గి వ్యక్తి చనిపోయే ప్రమాదం ఉంది. ఈ సమయంలో బొప్పాయి ఆకులు దివ్య ఔషధంగా పని చేస్తాయి. ఆకులు నేరుగా తినడం లేక జూస్ చేసుకొని తాగడంతో ప్లేట్‌లెట్లు వెంటనే పెరిగే అవకాశం ఉంది. మధుమేహ రోగులు తినడంతో చెక్కెర నిల్వలు సాధారణస్థాయికి రావడం, రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రోజు బొప్పాయి తీసుకుంటే పళ్ల నొప్పితో పాటు మతిమరుపు తగ్గే అవకాశం ఉంది. జీర్ణ వ్యవస్థ మెరుగుపడి పొట్ట, పేగుల్లో విష పదార్థాలు తొలగిస్తుంది.

– చంద్రశేఖర్, వైద్యాధికారి, గండేడ్

సాగు విస్తీర్ణం పెరుగుతోంది..



జిల్లాలో బొప్పాయి సాగు ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. సాగు చేసిన మొదట్లో అంటే పంట దిగుబడి ప్రారంభమయ్యే వరకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. సస్యరక్షణ చర్యలు పాటిస్తే సత్ఫలితాలు ఉంటాయి. ఎర్రనేలలు, ఇసుక నేలలు దీనికి అనుకూలం. నీటి వసతి పుష్కలంగా ఉండాలి. ప్రభుత్వం రెండేళ్లకు కలిపి హెక్టారుకు రూ.32 వేలు రైతుకు అందజేస్తుంది. డ్రిప్ సౌకర్యం కూడ కల్పిస్తుంది. జూలై, ఆగస్టులో బొప్పాయి సాగు రైతులకు ఎంతో లాభదాయకం.

– కె.వేణుగోపాల్, డీడీ, ఉద్యానశాఖ, మహబూబ్‌నగర్

జోగుళాంబను దర్శించుకున్న ప్రముఖులు


వైస్ చాన్స్‌లర్ విశ్వనాథ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ప్రధాన అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం : జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను శుక్రవారం డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ విశ్వనాథ్‌కుమార్ శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ సాదర స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో వారు ఏకవార రుద్రాభిషేకాలు, కుంకుమ అర్చనలు చేశారు. ఆలయ అర్చకులు వారికి క్షేత్ర ప్రాశస్త్యం తెలియజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. అదే విధంగా షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి నాయుడు కుటుంబ సమేతంగా దర్శించి అమ్మవారికి ఖడ్గమాల త్రిశతి పూజలు చేశారు. వనపర్తి నుంచి బదిలీ పై వచ్చిన ఎస్‌ఐ వెంకటస్వామి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయంలో రథోత్సవం :

జోగుళాంబ అమ్మవారి ఆలయంలో వారోత్సవ సేవలో భాగంగా ఉదయం యాగశాల మండపంలో చండీహోమాలు చేశారు. అలాగే సాయంకాలం ప్రదోశ కాలంలో దర్బార్ సేవలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని రథోత్సవం పై కూర్చోబెట్టి ఆలయ ప్రాకార మండపంలో ఊరేగించారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత


ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కోఆర్డినేటర్ ప్రవీణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు కోఆర్డినేటర్ ప్రవీణ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కొంచరియలు, విపత్కర పరిస్థితుల్లో ప్రజలను ఏ విధంగా రక్షించాలని అనే అంశంపై హిమాచల్‌ప్రదేశ్‌లో 10 రోజుల పాటు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ మేరకు క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు శుక్రవారం పీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ పీయూలో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రజలు ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నప్పుడు కాపాడేందుకు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

- పీఏసీఎస్‌లు పూర్తిస్థాయిలో మెరుగుపడాలి
- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సహకార సంఘాల ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని డీసీసీబీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపార అభివృద్ధే లక్ష్యంగా ఆయా సొసైటీలు ముందుకు సాగాలని రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. రాష్ట్రంలో మహబూబ్‌నగర్ డీసీసీబీ తొమ్మిదో స్థానంలో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఏసీఎస్‌ల సీఈఓల పనితీరు సరిగా లేదని మండిపడ్డారు. వీరి నిర్వాకంతోనే ఇటీవల డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్య సస్పెన్షన్‌కు గురయ్యారన్నారు. ఇప్పటివరకు ఇలా ముగ్గురు సీఈఓలు సస్పెన్షన్ కావడం బాధాకరంగా ఉందన్నారు. ముఖ్యంగా ఆదాయ మార్గాలను అన్వేషించి సహకార బ్యాంకులను పరిపుష్టి చేయాలన్నారు. జిల్లాలో కొత్త శాఖలను ఏర్పాటు చేయడానికి అవసరమైన విధివిధానాలు రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ సీఈఓ పురుషోత్తంరావు, మేకగూడ (షాద్‌నగర్) పీఏసీఎస్ చైర్మన్ మంజులారెడ్డితో పాటు బ్యాంకు డైరెక్టర్లు పాల్గొన్నారు.

పైపుల దుకాణంలో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న దుకాణ సముదాయాలలోని పైపుల షాప్‌లో మంటలు చెలరేగిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వెల్దండ మండల కేంద్రానికి చెందిన స్వామి కల్వకుర్తిలో మోటార్లు, వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు దుకాణాన్ని నడుపుతున్నాడు. వేరుశనగ వేయడానికి అనుకూలమైన కాలం కావటంతో స్ప్రింక్లర్ పైపులను తెచ్చి మాణిక్యారెడ్డి కాంప్లెక్స్‌లో ఉన్న మూడు దుకాణాలలో నిల్వచేశాడు. దుకాణాల ముందు ఉన్న చెత్తను ఒక దగ్గర పోగుచేసి నిప్పు పెట్టడంతో, గాలికి నిప్పు దుకాణాలలోకి వెళ్లి మంటలు చెలరేగాయని స్థానికులు, బాధితుడు చెబుతున్నారు. మంటలను గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వగా, వారువచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. మెల్లగా ప్రారంభమైన మంటలతో సుమారు రెండు దుకాణాలలో ఉన్న రూ.4లక్షల విలువగల పైపులు అగ్నికి కాలిపోయాయని, మిగిలిన పైపులు బాగానే ఉన్నాయని బాధితుడు తెలిపాడు. ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

రాగి తీగలే వారి లక్ష్యం


నిందితులతో పాటు నగదును చూపిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11మందితో కూడిన దొంగల ముఠా చోరీలు
- ఆ కోవలో ఇద్దరి మృత్యువాత
- ముగ్గురు దొంగల అరెస్ట్, మిగతా వారి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల: పొరుగు రాష్ట్రానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన కొందరు, వారికి తోడుగా మరి కొందరిని కలుపుకొని సోలార్ ప్లాంట్స్‌ను లక్ష్యంగా చేసుకుని ఉమ్మడి జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాలోని ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందుకు సంబంధించి శుక్రవారం జడ్చర్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కర్నూల్ జిల్లా డోన్ మండలం ద్రోణాచలానికి చెందిన వజ్రగిరి సర్పరాజ్, వజ్రగిరి మధు, వజ్రగిరి బాలస్వామి, వజ్రగిరి జయరాజ్, ఏడుకొండలు, ఎరుకలి మద్దిలేటి, ఎరుకలి సుంకన్న, ఎరుకలి నాగన్న, ఎరుకలి నవీన్, జంగన్న, నాగమణి ముఠాగా ఏర్పడి ఉమ్మడి పాలమూరు జిల్లాలో పలు దొంగతనాలకు పాల్పడ్డారు. మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి, రాణిపేట సోలార్ ప్లాంట్లతో పాటు అడ్డాకుల, చిన్నచింతకుంట, ఆమన్‌గల్, మానవపాడు, మక్తల్ ప్రాంతాల్లోని సోలార్‌ప్లాంట్లు, బ్యాటరీలు, సెంట్రింగ్ డబ్బాల చోరీ కేసులలో వీరు నిందితులుగా ఉన్నారు. వీరు తాము దొంగతనాలకు పాల్పడే ముందు పగటి వేళల్లో ఆయా ప్రాంతాల్లో సంచరించి సెక్యూరిటీ,తదితర పరిస్థితులను అంచనా వేసి రాత్రి సమయంలో చోరీకి పాల్పడతారు. కటింగ్ ప్లేయర్, తదితర వాటితో వైర్లను కట్ చేసి సామగ్రిని ఆటోలో తరలించి వాటిని మంటలో కాల్చి అందులో ఉన్న రాగి తీగలను అమ్మి సొమ్ము చేసుకుంటారు. వీరు ఆయా ప్రాంతాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తారు. వీరిలో నాగమణి అనే మహిళ ఎంట్రుకలు తీసుకుని స్టీలు సామాన్లు ఇచ్చే వృత్తి చేపడుతూ వీరికి సహకరిస్తుంటుంది. ఈక్రమంలోనే ముఠాలోని బోయిన్‌పల్లి వద్ద గల సోలార్ ప్లాంట్‌లో చోరీకి వెళ్లి వజ్రగిరి బాలస్వామి, వజ్రగిరి జయరాజ్ కరెంట్ తీగలను కట్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డారు.

ఇలా దొరికారు..

మిడ్జిల్ మండలంలోని మున్ననూర్ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం పోలీసులు తనిఖీ చేస్తున్న సమయంలో ఓ ఆటోలో రూ.4.50 లక్షలతో అనుమానాస్పదంగా కనిపించిన ఏపీలోని ద్రోణాచలానికు చెందిన వజ్రగిరి సత్యరాజ్, వజ్రగిరి మధు, పెబ్బేరుకు చెందిన మునుగురాయి రామక్రిష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలు బయటకు వచ్చాయని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. వీరు దొంగతనాల అనంతరం వైర్లను తరలించేందుకు ట్రాలీ ఆటో కొనుగోలు చేసేందుకు మహబూబ్‌నగర్ వెళ్తుండగా తమకు దొరికారని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు, ఆటోను స్వాధీన పర్చుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని అన్నారు. సమావేశంలో సీఐ నాగార్జునగౌడ్, ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇస్తామంటూ దారి దోపిడీ

ఇద్దరు దొంగల అరెస్ట్


పట్టుబడిన నిందితులు, బైక్‌లతో డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు

జడ్చర్ల: ప్రధాన రహదారులపై లిఫ్ట్ అడిగే వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు ఆయన వెల్లడించారు. భూత్పూర్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మెట్టు శివశంకర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా గగ్గలపల్లికి చెందిన షేక్ లతీఫ్ ఇద్దరు ఓ ముఠాగా ఏర్పడి దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. అందులో భాగంగా అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన వనం బురాన్ ఈనెల 17న జడ్చర్ల మండలం బూరెడ్డిపల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై తమ గ్రామానికి వెళ్లేందుకు వేచి ఉండగా నిందితులు మోటార్ బైక్‌పై అతనికి లిఫ్ట్ ఇచ్చారు. బైక్‌పై ఎక్కిన కొద్ది సేపటికే పక్కనే ఉన్న వెంచర్‌లోకి తీసుకెళ్లి కత్తితో బెదిరించి అతన వద్ద నుంచి సెల్‌ఫోన్‌తో పాటు రూ.2200 నగదు తీసుకుని పరారీ అయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా శుక్రవారం జడ్చర్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తుండగా నిందితులు పట్టుబడ్డారని డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1160 నగదు, సెల్‌ఫోన్, కత్తితోపాటు చోరీ చేసిన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కాగా నిందితుడు శివశంకర్‌రెడ్డి చిన్నతనంలోనే తమ గ్రామంలో మోటార్ బైక్ చోరీ చేసి జువైవల్‌కు వెళ్లాడని, తదుపరి జడ్చర్ల, అమిస్తాపూర్‌లలో ఆటోల చోరీ, మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మోటార్ బైక్‌ల చోరీ కేసుల్లో నిందితుడన్నారు. సమావేశంలో సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ శివానందం గౌడ్‌లు పాల్గొన్నారు.

బూడిద లారీ ఢీ : గాంధీ విగ్రహం ధ్వంసం



కృష్ణా: హిందూపూర్ చౌక్‌లో గాంధీ విగ్రహం శుక్రవారం తెల్లవారుజామున బూడిదలారీ ఢీ కొనడంతో ధ్వంసమైంది. దాంతో పాటూ కట్ట కూడా నేలమట్టమైంది. లారీ డ్రైవర్లు ఓవర్ స్పీడ్‌తో రావడంతో వల్లే తరచూ ఇక్కడ పలు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రమాదాలను నియంత్రించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా ఇలా విగ్రహాలను బూడిద లారీలు ఢీ కొట్టడం ఇప్పటికే రెండుసార్లు చోటు చేసుకుందని చెబుతున్నారు.

బస్సు ఢీకొని 154 గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూరు: కర్ణాటక రాయిచూర్ జిల్లాలోని ఎర్రమొర్స్ ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం ప్రైవేట్ బస్సు ఢీకొని 154 గొర్రెలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే.. ఊట్కూరు మండలం, ఓబులాపూర్ గ్రామానికి చెందిన అనంతమ్మ, మల్లేష్, పూజారి శీనప్పకు చెందిన గొర్రెలు రోడ్డుపై వెళ్తుండగా.. ఘటన చోటు చేసుకుంది. బస్సు మందపైకి వెళ్లడంతో గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం తరపున ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా అందించారు. అంజప్ప, వెంకటేష్‌గౌడ్, బాలప్ప, శీనప్ప తదితరులు ఉన్నారు.

మెకానిక్ షాప్ దగ్ధం

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు ఓ మెకానిక్ షాప్(డబ్బా) దగ్ధమైన ఘటన శుక్రవారం ఉదయం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. క్రిష్ణవేణి చౌక్‌లో సలీం అనే వ్యక్తి బైక్ మెకానిక్ షాప్(డబ్బా)ను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు పరిసర ప్రాంతంల్లో చెత్తను అట్టించారు. ఈదురు గాలులతో నిప్పు రవ్వలు షాప్‌పై పడ్డాయి. దీంతో షాప్‌లో ఉన్న ఓ బైక్ మంటల్లో కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనలో రూ. 50 వేల ఆస్తి నష్టం చోటు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

టీచర్ల సర్దుబాటుకు అనుమతి

విద్యాశాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని అన్ని జిల్లా కలెక్టర్లు, డీఈవోలకు పాఠశాలవిద్య డైరెక్టరేట్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే క్రమంలో ఒకే గ్రామ పంచాయతీ పరిధిలో ఉండే రెండు స్కూళ్లను విలీనం చేసే అధికారాన్ని జిల్లా యంత్రాంగానికి అప్పగించారు. పాఠశాల విద్య డైరెక్టర్ ఇ.నర్సింహారెడ్డి శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. తాజా యూడైస్ డేటాను పరిగణనలోనికి తీసుకుని ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని సూచించారు. చాలా స్కూళ్లలో విద్యార్థులున్నా, టీచర్లు ఉండటం లేదని, టీచర్లు ఎక్కువగా ఉన్నచోట విద్యార్థులు ఉండటం లేదని గుర్తించారు. టీచర్లు లేని స్కూళ్లలో విద్యార్థులు చేరినా, తిరిగి వారు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిపోతున్నారని చెప్పారు. దీన్ని నివారించేందుకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే కాంప్లెక్స్‌లో రెండు స్కూళ్లు ఉంటే, వాటిని విలీనం చేసేందుకు విద్యాశాఖ అనుమతించింది. ఎంతమంది విద్యార్థులకు ఎంతమంది టీచర్లు ఉండాలో విద్యాశాఖ సూచించింది.

ప్రైమరీ... యూపీఎస్ స్కూళ్లలో	
విద్యార్థులు	ఉండాల్సిన టీచర్లు
1-10	1
11-60	2
61-90	3
91-120	4
121-105	5
153-200	6
అప్పర్ ప్రైమరీ ఆ పైన	
1-20	సబ్జెక్టు టీచర్లు - 2 (1 లాంగ్వేజ్, 1 సబ్జెక్టు)
21 ఆపైన	సబ్జెక్టు టీచర్లు - 4

చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ బదిలీ

కొత్త సూపరింటెండెంట్‌గా రామచంద్రం

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్ బదిలీ అయ్యారు. చర్లపల్లి నూతన సూపరింటెండెంట్‌గా జి.రామచంద్రంను నియమిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యదర్శి రవిగుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంతోష్‌కుమార్ రాయ్‌ను సంగారెడ్డి సెంట్రల్ జైలు ఎస్పీగా బదిలీ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న జి.రామచంద్రం ఎస్పీగా పదోన్నతి పొందారు. 15 రోజుల్లో సూపరింటెండెంట్ పోస్టులో చేరాలని ఆదేశించారు.

'లడ్డూ' వివాదంపై నివేదిక కోరిన కేంద్రం

సీఎం చంద్రబాబుతో మాట్లాడిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా

- అందుబాటులో ఉన్న నివేదికలను తమకు పంపాలని సూచన
- వివాదంపై సమగ్ర విచారణ జరపాలి: కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ కుట్ర: కాంగ్రెస్ నేత పవన్ ఖేరా



సాక్షి, న్యూఢిల్లీ: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై నెలకొన్న వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కేంద్రం సమగ్ర నివేదిక కోరింది. లడ్డూ వివాదంపై అందుబాటులో ఉన్న నివేదికలను సత్వరమే తమకు నివేదించాలని చెప్పింది. వివాదం నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ప్రకటించారు. 'ఈ వివాదంపై సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడాను. కొన్ని వివరాలు అడిగి తెలుసుకున్నా. అందుబాటులో ఉన్న నివేదికను పరిశీలించడానికి వీలుగా కేంద్రానికి పంపాలని కోరాను. నేను రాష్ట్ర నియంత్రణ అధికారులతో కూడా మాట్లాడి దీనిపై దర్యాప్తు చేస్తాం. నివేదికను పరిశీలించి ఆహార భద్రతా ప్రమాణాల ప్రకారం చర్యలు తీసుకుంటాం'అని ఆయన ఢిల్లీలో తెలిపారు.

సమగ్ర దర్యాప్తు జరగాలి : ప్రహ్లాద్ జోషి

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లుగా ఇది చాలా గంభీరమైన విషయం. దర్యాప్తు తర్వాత ఎవరైతే తప్పు చేశారో వారికి శిక్ష పడాలి.

బాధ్యులపై చర్యలు తప్పవు: జితేంద్ర సింగ్

తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో బాధ్యులపై చర్యలు తప్పవని తాను విశ్వసిస్తున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ వ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయన్నారు. ఇలాంటి ఘటన ఊహించలేదని అన్నారు. భక్తుల విశ్వాసాలను తిరిగి పెంపొందించే విధంగా సమగ్ర దర్యాప్తు జరుగుతుందని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ కుట్ర : పవన్ ఖేరా

ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ తిరుమల లడ్డూ ప్రసాదం వ్యవహారంలో కుట్ర చేస్తోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ఆరోపించారు. సోషల్ మీడియాలో కొత్త కొత్త వాదనలు వినిపిస్తున్నాయని, దీనివల్ల ఎవరికి లాభమని ఆయన ప్రశ్నించారు. తిరుపతి బాలజీపై ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు భక్తి విశ్వాసాలున్నాయని, వాటితో ఆడుకునే వారిని క్షమించరని అన్నారు. వెంటనే ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గుర్తు లేదు..మరిచిపోయిన!

జస్టిస్ పీసీ ఘోష్ ఎదుట నీళ్లు నమిలిన ఇంజనీర్లు

సాక్షి, హైదరాబాద్: 'నాకు తెలియదు.. గుర్తు లేదు.. మర్చిపోయిన..'కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ వేసిన ప్రశ్నలకు కొందరు నీటిపారుదల శాఖ ఇంజనీర్లు చెప్పిన వింత సమాధానాలు ఇవి. తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ లేబొరేటరీ(టీఎస్ఈఆర్ఎల్) చీఫ్ ఇంజనీర్‌గా వ్యవహరించిన శ్రీదేవిని కమిషన్ ఏ ప్రశ్న అడిగినా 'తెలీదు..గుర్తు లేదు'అని సమాధానాలివ్వగా, కమిషన్ ఆమెపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన మోడల్ స్టడీస్ విషయంలో కీలకపాత్ర పోషించిన ఆమెపై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించగా, సమాధానాలు ఇవ్వలేక నీళ్లు నమిలారు. బరాజ్‌లను నిర్మించడానికి ముందే మోడల్ స్టడీస్ చేశామని తొలుత చెప్పిన ఆమె, ఆ వెంటనే మాట మార్చారు. దీంతో మీరు ఇచ్చిన అఫిడవిట్‌లోని సమాచారానికి సైతం కట్టుబడి ఉండకపోతే ఎలా? అని ఆమెపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో పలువురు ఇంజనీర్లకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది.

- స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్(ఎస్డీఎస్ఓ) సీఈగా సైతం శ్రీదేవి వ్యవహరించగా, ఆ పోస్టులో ఉండి బరాజ్‌ల పరిరక్షణకు ఐఎస్ కోడ్‌ను అమలు చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా, మౌనంగా ఉండిపోయారు.
- బరాజ్‌లకు వరదలు ఎప్పుడొచ్చాయన్న ప్రశ్నకు సైతం తెలియదు అని బదులిచ్చారు.
- బరాజ్‌లకు 2020లో త్రీడీ మోడల్ స్టడీస్ నిర్వహించినట్టు ఆమె చెప్పగా, 2023లో జరిగినట్టు టీఎస్ఈఆర్ఎల్ నివేదిక ఇచ్చిందని కమిషన్ ఆమెకు తెలియజేసింది. అయితే ఆ విషయం తనకు గుర్తు లేదని ఆమె బదులివ్వడంతో కమిషన్ అసహనం వ్యక్తం చేసింది.

బరాజ్‌లకు తనిఖీలు చేయలేదు

బరాజ్‌ల పరిరక్షణకు ఏం చర్యలు తీసుకున్నారని ఎస్డీఎస్ఓ సీఈ ప్రమీళను కమిషన్ ప్రశ్నించగా, ఆ బాధ్యత ప్రాజెక్టు అథారిటీదేనని ఆమె బదులిచ్చారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్ అమల్లోకి వచ్చినా బరాజ్‌ల భద్రత వాటి చీఫ్ ఇంజనీర్‌దేనని స్పష్టం చేశారు. గేట్ల నిర్వహణలో మ్యానువల్స్, బరాజ్‌ల నిర్వహణ ప్రొటోకాల్స్ అమలు చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా, ఆమె సమాధానమివ్వడానికి ఇబ్బంది పడ్డారు. దీంతో పేర్లు చెప్పకుండా వివరాలు తెలపాలని కమిషన్ ఆమెను కోరింది. చట్టం ప్రకారం వర్షకాలానికి ముందు, తర్వాత తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇవ్వలేదని ఆమె వివరించారు.

– ఎస్డీఎస్ఓ ఈఈ విజయలక్ష్మి సైతం ఇదే విషయాన్ని కమిషన్‌కు తెలిపారు.

అధ్యయనాలు, నిర్వహణ లేకపోవడమే కారణం

బరాజ్‌ల వైఫల్యానికి కేవలం నిర్వహణ, పర్యవేక్షణ లోపాలే కాకుండా వాటికి ఎగువ, దిగువన రక్షణ చర్యలు తీసుకోకపోవడం కూడా కారణమేనని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) ఈఈ రఘునాథ శర్మ తెలిపారు. 2019 లోనే వరదల తర్వాత బరాజ్‌లలో లోపాలు బయటపడగా, 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బరాజ్ కుంగే వరకు మరమ్మతులు చేయలేదని ఆరోపించారు. వైఫల్యానికి కారకులు ఎవరు? నాటి ప్రభుత్వ అధినేతనా? అని కమిషన్ అడగ్గా, 3డీ మోడల్ అధ్యయనాలు జరపకపోవడం, నిర్వహణ ప్రొటోకాల్స్ పాటించకపోవడం కారణమని ఆయన బదులిచ్చారు.

- మోడల్ స్టడీస్ పూర్తికాక ముందే బరాజ్‌ల నిర్మాణం ప్రారంభించడంతోనే విఫలమయ్యాయని పలువురు టీఎస్ఈఆర్ఎల్ ల్యాబ్ ఇంజనీర్లు కమిషన్‌కు తెలిపారు. బరాజ్‌లను నీటి మళ్లింపుకోసం నిర్మిస్తారని, నిల్వ చేయడంతోనే కుంగిపోవడం, సీపేజీలు ఏర్పడడం జరిగిందన్నారు. వరదల సమయంలో కూడా గేట్లు మూసి ఉంచడంతో ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు.

తిరుమల లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి

- లేదా విచారణ కోసం ఓ కమిటీని ఏర్పాటుచేయండి
- వాస్తవాల నిగ్గు తేల్చండి
- సీజే ధర్మాసనం ముందు వైవీ సుబ్బారెడ్డి తరపున పొన్నవోలు ప్రస్తావన
- వచ్చే బుధవారం విచారణ జరుపుతామన్న ధర్మాసనం



సాక్షి, అమరావతి : తిరుమల శ్రీవారి లడ్డూలో ఉపయోగించే నెయ్యి కల్తీపై వాస్తవాలను తేల్చేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టును కోరారు. ఒకవేళ సిట్టింగ్ జడ్జితో విచారణ సాధ్యం కాకపోతే, విచారణ నిమిత్తం ఓ కమిటీని ఏర్పాటుచేయాలని ఆయన హైకోర్టును అభ్యర్థించారు. తద్వారా వాస్తవాల నిగ్గుతేల్చాలని కోరారు. ఈ అభ్యర్థనతో తాము ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేయనున్నామని, దీనిపై విచారణ జరపాలని ఆయన ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనాన్ని కోరారు. శ్రీవారి లడ్డూలో ఉపయోగించే నెయ్యి విషయంలో వాస్తవాలను తెలుసుకోకుండా ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడుతున్నారని.. అందువల్ల నిజానిజాలు బయటకు రావాల్సి ఉందన్నారు. అందుకోసమే తాము ఈ వ్యాజ్యం దాఖలు చేస్తున్నామన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది శ్రీవారి భక్తుల మనోభావాలకు సంబంధించినది కాబట్టి ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని సుధాకర్‌రెడ్డి న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను తాము బుధవారమే విచారిస్తామని, ఈలోపు పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది.

పవన్.. ఇదేం తీరు?

- దోషులను గుర్తించి చర్యలు తీసుకోండి
- అది మానేసి జాతీయ స్థాయిలో ఆందోళనలను వ్యాపింపజేస్తారా?
- సినీ నటుడు ప్రకాశ్ రాజ్ అసహనం

సాక్షి, అమరావతి : శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు రాజేసిన వివాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 'ఎక్స్' వేదికగా చేసిన వ్యాఖ్యలపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. 'మీరు డిప్యూటీ సీఎంగా ఉన్న రాష్ట్రంలో ఈ ఘటన జరిగింది. దానిపై విచారణ జరిపి.. దోషులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోండి. ఆ పని చేయడం మానేసి ఈ ఆందోళనను జాతీయ స్థాయిలో వ్యాపింపజేస్తున్నారు. ఇప్పటికే దేశంలో ఉన్న మత కల్లోలాలు చాలవా?' అంటూ ప్రకాశ్ రాజ్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

జరిగి ఉండదనే అనుకుంటున్నా..

చంద్రబాబు ఆరోపణలపై మాజీ ఐఏఎస్ ఐవైఆర్

సాక్షి, అమరావతి : 'తిరుమల లడ్డు వ్యవహారంలో సీఎం చంద్రబాబు చేసిన కీలకమైన ఆరోపణను నేను నమ్మడంలేదు, అది జరిగి ఉండదనే అనుకుంటున్నా'.. అంటూ బీజేపీ నేత, మాజీ ఐఏఎస్ ఐవైఆర్ కృష్ణారావు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన వీడియో సందేశం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ ఆరోపణను రాష్ట్రంలో అత్యున్నత రాజకీయ స్థానంలో ఉన్న వ్యక్తి చేసినందున తప్పకుండా దీనిని పూర్తిస్థాయిలో విచారించి, పూర్వాపరాలను నిర్ధారించి సంబంధీకులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ చంద్రబాబు ఆరోపణ నిజం కాకపోతే ఆయన ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని ఐవైఆర్ ఆ వీడియోలో చెప్పారు.

కాంప్లెక్స్ ఎరువుల సబ్సిడీల సవరణ

- సబ్సిడీ పెంపుతో తగ్గనున్న డీఏపీ ధర
- 28-28, 24-24 తదితరాల సబ్సిడీ తగ్గింపు
- వచ్చేనెల ఒకటో తేదీ నుంచి కొత్త ధరలు అమలు

సాక్షి, హైదరాబాద్: పోషక కాంప్లెక్స్ ఎరువుల సబ్సిడీలను కేంద్రం సవరించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీఏపీ సబ్సిడీని టన్నుకు రూ.21,675 నుంచి రూ.21,912కు పెంచింది. దీంతో దాని ధర కాస్త తగ్గుతుంది. 28-28 ఎరువుల సబ్సిడీ టన్నుకు రూ.538 తగ్గించింది. దీంతో దాని ధర పెరగడం వల్ల రైతులపై స్వల్పంగా భారం పడే అవకాశం ఉందని అంటున్నారు. 24-24 ఎరువుల సబ్సిడీని టన్నుకు రూ.461 తగ్గించడంతో దాని ధర కూడా కొంత పెరుగుతుంది. అలాగే 24-24-0-8 సబ్సిడీని రూ.461, 19-19-19 సబ్సిడీని రూ.365, 16-16-16 సబ్సిడీని రూ. 307 తగ్గించడంతో వీటి ధరలు కూడా మార్కెట్లో పెరుగుతాయి. సవరించిన, పెంచిన సబ్సిడీ మేరకు మారిన ధరలను వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అంటే యాసంగి సీజన్‌లో ఈ ధరలతోనే రైతులు ఎరువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది మార్చి వరకు ఈ ధరలు అమల్లో ఉంటాయి.

బ్యాంకు ఖాతాలో నుంచి నగదు మాయం

మహబూబ్‌నగర్ క్రైం: సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్ ఓపెన్ చేయడంతో బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులు మాయం చేశారు. వివరాల్లోకి వెళితే జిల్లాకేంద్రానికి చెందిన అబ్దుల్ రెహమాన్ సెల్‌ఫోన్‌కు గురువారం సాయంత్రం ఓ లింక్ రావడంతో దానిని ఓపెన్ చేశాడు. శుక్రవారం తెల్లవారుజామున ఖాతాలో నుంచి మొదట రూ.25వేలు, తర్వాత రూ.10వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో బాధితుడు సైబర్ క్రైం టోల్ ఫ్రీ 1930కు ఫిర్యాదు చేయడంతో పాటు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఏటీఎం వద్ద కార్డు మార్చి ఖాతా ఖాళీ..

జడ్చర్ల: పట్టణంలోని ఓ ఏటీఎం కేంద్రం ఓ వ్యక్తిని ఏమార్చి ఓ అపరిచితుడు అతడి ఖాతాను ఖాళీ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. ఆల్వాన్‌పల్లికి చెందిన కృష్ణయ్య నగదు తీసుకునేందుకు సిగ్నల్‌గడ్డ వద్ద ఉన్న ఓ ఏటీఎం సెంటర్‌కు వచ్చాడు. తన కార్డును ఉపయోగించి నగదును డ్రా చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న ఓ అపరిచిత వ్యక్తి సాయం చేస్తానంటూ ఏటీఎం కార్డు తీసుకున్నాడు.. తన వద్ద ఉన్న మరో ఏటీఎం కార్డు కృష్ణయ్య చేతిలో పెట్టి అతడి కార్డును తాను తీసుకుని వెళ్లాడు. తదుపరి కృష్ణయ్య ఖాతా నుంచి మూడు విడతలుగా డబ్బు డ్రా చేసుకున్నాడు. కాగా తన ఫోన్‌కు డబ్బులు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో కృష్ణయ్య ఖంగు తిన్నాడు. రూ.27వేలను డ్రా చేశారని గుర్తించాడు. జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంత్యక్రియలకు వెళ్తూ.. అనంతలోకాలకు

రాజాపూర్(బాలానగర్): అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా.. లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం బాలానగర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫరూక్‌నగర్ మండలం వెల్జర్లకి చెందిన రఫీక్, అతడి తల్లి రహనాబేగం (40) మోటార్ సైకిల్‌పై.. రాజాపూర్ మండలం చొక్కంపేట్‌లో బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో బాలానగర్ మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డులో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద మోటార్‌సైకిల్ స్లో కావడంతో వెనుకాలే వస్తున్న ఓ కంటైనర్ లారీ ఢీ కొంది. ఘటనలో రఫీక్ రోడ్డు పక్కకు పడిపోయాడు. కాగా రహనా బేగం రోడ్డుపై పడిపోవడంతో కంటైనర్ ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాలానగర్ ఎస్ఐ తిరుపాజీ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఎస్‌వీఎస్‌లో వైద్య విజ్ఞాన సదస్సు

25 విభాగాల్లో 1,200 రకాల స్టాల్స్ ఏర్పాటు





విజ్ఞాన సదస్సు ప్రారంభిస్తున్న ఎస్‌వీఎస్ ఎండీ డాక్టర్ కేజే రెడ్డి తదితరులు

పాలమూరు: వైద్య విజ్ఞాన సదస్సులతో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, మెడికల్ సైన్స్‌పై అవగాహన పెరిగే అవకాశం ఉందని ఎస్‌వీఎస్ ఎండీ డాక్టర్ కేజే రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాలలో శుక్రవారం వైద్య విజ్ఞాన ప్రదర్శన (ఎస్‌వీఎస్ మెడ్ ఎక్స్‌పో- 2024)ను ప్రారంభించారు. ఎస్‌వీఎస్ ఏర్పాటు చేసిన వైద్య విజ్ఞాన ప్రదర్శన సదస్సును ఎస్‌వీఎస్ ఎండీ డాక్టర్ కేజే రెడ్డి, మేనేజింగ్ కమిటీ చైర్మన్ విజయరాఘవన్, ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి కె.కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ నెల 23 వరకు జరిగే వైద్య విజ్ఞాన సదస్సులో మొత్తం 25 విభాగాలకు సంబంధించిన అంశాలను ప్రదర్శనకు ఉంచనున్నారు. మొదటి రోజు ఆర్థో, ఈఎన్‌టీ, నర్సింగ్, ఫిజియాలజీ, ఫల్మానాలజీ మెడిసిన్, బయో కెమిస్ట్రి విభాగాలకు సంబంధించి 1,200 రకాల స్టాల్స్ ఏర్పాటు చేయగా.. మొత్తం 2,050 మంది విద్యార్థులు తిలకించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెడిసిన్‌పై అవగాహన పెంచే ప్రయత్నంలో వైద్య విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నాలుగు రోజుల పాటు సాగే సదస్సును ఉమ్మడి జిల్లాలో ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, రెసిడెంట్ కార్యదర్శి రాంరెడ్డి, ప్రిన్సిపాల్ జోషి, వైస్ ప్రిన్సిపాల్ రోహిత్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు స్వల్ప వరద



నీటితో కళకళలాడుతున్న జూరాల ప్రాజెక్టు

ధరూరు/ఆత్మకూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శుక్రవారం సాయంత్రం 13 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో ఉదయం నాలుగు యూనిట్లలో విద్యుదుత్పత్తి చేయగా.. రాత్రి రెండు యూనిట్లు తగ్గించారు. విద్యుదుత్పత్తి కోసం 7,849 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 95 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు -1కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820 క్యూసెక్కులు, కుడి కాల్వకు 700 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సమాంత కాల్వకు 900 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 11, 654 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తాన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 343.007 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 878.4 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం నీటిమట్టం 878.4 అడుగుల వద్ద 179.8995 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంకు నీటి ప్రవాహం లేదు. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 33,625 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,512, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2.400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమ గట్టు భూగర్భ కేంద్రంలో 16.582 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 3.428 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు.

జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న పిడమర్తి రవి

మహబూబ్‌నగర్ రూరల్: ఉమ్మడి జిల్లాలో ఎస్సీ జనాభాలో 90 శాతం ఉన్న మాదిగలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని.. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాదిగల మేలు కొలుపు యాత్రలో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్‌కు వచ్చారు. పాతపాలమూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట్రంలో అమలు చేసేందుకు ప్రభుత్వం కమిటీ వేయడం హర్షనీయమన్నారు. జిల్లాల వారీగా వర్గీకరణ చేపట్టే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు.. అన్ని జిల్లా కేంద్రాల్లో మాదిగల మేలుకొలుపు యాత్ర ఉంటుందని చెప్పారు. మాదిగలు, లంబాడీలు, మాలలకు, ముదిరాజ్‌లకు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 30న భువనగిరిలో ముగింపు సభ ఉంటుందని తెలిపారు. మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్, కౌన్సిలర్ శ్రీనివాసులు, జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మిట్ట యాదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్, సింగిరెడ్డి పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తౌహీద్ వీరవిహారం

- 51 బంతుల్లో అజేయ శతకంతో సత్తా
- రైజెన్‌ట్రోంజ్ జట్టుకు 'ఎంథూజియా 24' టైటిల్
- ఫైనల్లో 7 పరుగుల తేడాతో ఇన్సెండియోజ్‌పై విజయం



గెలుపు ఆనందంలో రైజెన్‌ట్రోంజ్ జట్టు



సెంచరీ అనంతరం బ్యాట్‌తో అభివాదం చేస్తున్న తౌహీద్ రహమత్

మహబూబ్‌నగర్ క్రీడలు: 'ఎంథూజియా 24' క్రికెట్ టోర్నమెంట్‌లో రైజెన్‌ట్రోంజ్ ఓపెనర్ తౌహీద్ రహమత్ (51 బంతుల్లో 105 నాటౌట్; 15 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దీంతో రైజెన్‌ట్రోంజ్ జట్టు 7 పరుగుల తేడాతో ఇన్సెండియోజ్ జట్టుపై గెలిచింది. ప్రభుత్వ మెడికల్ కాలేజి గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రైజెన్‌ట్రోంజ్ నిర్ణీత 15 ఓవర్లలో వికెట్ నష్టానికి 192 పరుగుల భారీస్కోరు చేసింది. ఓపెనర్ రాఘవ రెడ్డి (0) తొలిఓవర్లోనే డకౌటై నిష్క్రమించాడు. వన్‌డౌన్ బ్యాటర్ చెవ్వా అన్వేష్ (42 బంతుల్లో 69; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులోకి రాగా ఓపెనర్ తౌహీద్ రహమత్ ప్రత్యర్థి బౌలర్లపై భారీషాట్లతో విరుచుకుపడ్డాడు. ఇద్దరు కలిసి అబేధ్యమైన రెండో వికెట్‌కు 88 బంతులకు 192 పరుగులు జోడించారు. అనంతరం 193 పరుగుల భారీ లక్ష్యం ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇన్సెండియోజ్ జట్టు 15 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసి ఓడింది. ఓపెనర్ పిల్లి అభిలాష్ (37 బంతుల్లో 54; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు. మిగతా వారిలో రాహుల్ రెడ్డి (20 బంతుల్లో 37; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), నితిన్ (8 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అజయ్ (8 బంతుల్లో 20; 3 ఫోర్లు, 1 సిక్స్) జట్టును గెలిపించేందుకు ధాటిగా ప్రయోజనం లేకుండా పోయింది. సెంచరీతో అజేయంగా నిలిచిన తౌహీద్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు.

22న ఉమ్మడి జిల్లా అండర్-19 జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభంకానున్న హెచ్‌సీఏ అండర్-19 అంతర్ జిల్లా టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలు ఈనెల 22న స్థానిక ఎండీసీఏ మైదానంలో నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలు ఉదయం 10 గంటలకు జరుగుతాయని పేర్కొన్నారు.1.9.2005 తర్వాత పుట్టిన వారు ఎంపికలకు అర్హులని తెలిపారు. క్రీడాకారులు వైట్ డ్రెస్, వైట్ షూస్‌తోపాటు బోనఫైడ్ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణపత్రం, ఎస్ఎస్‌సీ మెమో, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో ఎంపికలకు హాజరుకావాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

వెల్దండ: కర్రెవానిపల్లి రెవెన్యూ శివారుల్లో అక్రమంగా డీసీఎంలో రేషన్ బియ్యం శుక్రవారం తరలిస్తుండగా రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. కల్వకుర్తికి చెందిన నితిన్ అనే వ్యక్తి డీసీఎంలో 96 బస్తాల రేషన్ బియ్యం దొంగ రోడ్డులో తరలిస్తున్నారు. పక్క సమాచారంతో అధికారులు వాహనాన్ని నిలిపి బియ్యంను ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు హేమ్లానాయక్, రాఘవేందర్‌రెడ్డి, ఆర్ఐ శంకర్ పరిశీలించారు. డీసీఎంలో 45 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి.. అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రేషన్ బియ్యంను తరలిస్తున్న వాహనంపై, వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో వాలీబాల్ క్రీడాకారుడు మృతి



ఆయాజ్ (ఫైల్)

నవాబుపేట: గుండెపోటుతో జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారుడు ఆయాజ్ (39) శుక్రవారం మృతి చెందాడు. యన్మన్‌గండ్లకి చెందిన ఆయాజ్ గతంలో జూనియర్ విభాగంలో జాతీయస్థాయి పోటీలో పాల్గొన్నారు. శుక్రవారం గ్రామంలో తన నివాసంలో ఉన్నటుండి అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. పలువురు వాలీబాల్ క్రీడాకారులు ఆయనకు నివాళులర్పించారు.